# పతివ్రత ఆంతరంగికం

ఆమెకు ఆ వూళ్ళో మంచి పేరువుంది-పతివ్రత అని. తన పనేమో తానేమో తప్ప ఎవ్వరిజోక్యం పట్టించుకునేది కాదు. ఊరు చిన్నదయినా, ఆ వూళ్ళోకూడా ఆమెని ఎరగని వాళ్లు-అంటే చూడనివాళ్ళు చాలామంది వున్నారు. ఇంటిపని అంతా ఆమె చూసుకునేది. పూజలూ, పునస్కారాలూ, భర్తనే దైవంగా చూట్టం. పాచి ఊడవటం, కళ్ళాపి జల్లటం, చెంబులు తోమటం, వంట చెయ్యటం మొదలయిన పనుల్తో ఆమె జీవితం పూర్తయ్యేది. ఆమె బయటకు రావలసిన అవసరమే వుండేదికాదు. ఎప్పుడయినా పిడక పట్టుకొని పక్క యింటికి నిప్పుకోసం వెళ్తూవుండేది. ఆ ఊళ్లో ఆమె రోజూ వెళ్ళేస్థలం, చెరువు గట్టుమీద వున్న తుమ్మతోపు. ఆ పనయినా కోడి కూసినప్పుడు లేచి తీర్చుకునేది. ఇక ఆమె ఇతరుల కంట పడవలసిన అవసరం ఏముంది?

ఇంత కట్టుదిట్టాల్లో జీవితం గడపడంవల్ల కాపరానికి వొచ్చిన నాలుగయిదు సంవత్సరాల్లోనే ఆమె ఆ వూళ్లో మంచిపేరు సంపాదించుకుంది. ఫలానావారి కోడలు అనిపించుకుంది. కొప్పుపెట్టి, అర్ధణావెడల్పు బొట్టుపెట్టి, కాళ్ళకు వెండికడియాలు, వంకర కడియాలూ, గొలుసులూ పెట్టి, చెంగుదోపి నడుస్తుంటే చూసినవాళ్ళంతా, 'శ్రీమహాలక్ష్మి' అనుకునే వారు "సీతమ్మతల్లి-కళ్ళపడితేసాలు, జన్మ తరించిపోతుంది" అనుకునే వారు.

అటువంటి మనిషి-పతివ్రత-ఈ ఆపదను ఎట్లా ఓర్చుకుంటుంది! ఎట్లా సహిస్తుంది? ఎట్లా భరిస్తుంది? ఆమెకు ఈ ప్రపంచంలో ఆపదల్లేవు, బాధల్లేవు. ఆమె కాపరానికివొచ్చిం తర్వాత ఇంతవరకూ నిజంగా ఒకే ఒకసారి బాధపడింది. అది వాళ్ళ పెయ్య మొదటియీతకు. ఆ పెయ్యని తన చేతుల మీదుగా పెంచింది. ఆ పెయ్య ఎదైనప్పుడు ఆమెకు ఎంత

సంతోషం కలిగింది? పునుకొల్లువారి ఆంబోతు దగ్గరకు తీసుకువెళ్తానంటే ఆమె పోట్లాడి సుంకరవాళ్ళ ఆంబోతు దగ్గరకు పంపింది. పునుకొల్లువారి ఆంబోతు ముసల్ది—పైగా పర్వతం లాగా వుంటుంది. తనదూడ పసిది—పైగా పొట్టి అమాయకపు మోడు! అటువంటి ఆ పెయ్య ఈనలేక తన్నుకుంటూంటే ఆమె మనస్సు ఎంత కొట్టుకులాడిందో! "గంగమ్మతల్లీ, నీకెంతకష్టం వొచ్చిందే!" అని కళ్ళవెంట నీళ్ళు పెట్టుకుంది మనస్సులో సుంకరవాళ్ళ ఆంబోతునీ, సుంకరవాళ్ళనీ తిట్టిపోసింది.

అప్పుడు పడ్డది బాధ....మళ్ళీ ఇప్పుడు. కాని అప్పుడు కూడా తన పెయ్య నొప్పులు పడుతూవుంటే ఏ పొరలోనే సంతోషంగావుంది. ఎక్కడో బరబర, జరజర, పరపర, జలజలమంటూ వుండేది. కాని యిప్పుడలాకాదు. ఆ మాట వినేటప్పటికే మొదలునరికిన చెట్లల్లే కూలింది.

పట్టణం వెళ్ళిన భర్త కారుకిందపడి చచ్చిపోయాడని వార్త. ఒక రోజు పొద్దున్నే పాచి వూడ్చుకుంటూ వుంటే పిడుగులాగా ఈ వార్త వొచ్చింది. ఈ మాట విన్నది, విన్నపళంగానే స్పృహతప్పి పడిపోయింది. 'అర్జునా, ఫల్గునా, కిరీటీ' అనేవాళ్ళుకూడా లేకపోయారు.

క్షణంలో యీ వార్త వూరంతా పాకింది. "దొడ్డయిల్లాలమ్మా!" "ఏనాడు కాపరానికి వొచ్చిందో, గడపదాటి ఎరుగదమ్మా!" "నడుస్తుంటే భూమి అరుగుతుందేమో అన్నట్టు నడిచేదమ్మా!" అనుకుంటూ అమ్మలక్కలంతా బయల్దేరారు. ఒక వితంతువు: "ఈ ఆపద నాబోటిదానికి రాగూడదమా?" అని కోరుకుంది కన్నీటితో!

అంతా చుట్టూచేరారు. ఆమెకు సపర్యలు చెయ్యటం మొదలు పెట్టారు. నీళ్ళు అందిచ్చేవాళ్ళు అందిస్తున్నారు. మొహంమీద చిలికేవాళ్ళు చిలుకుతున్నారు. కేకలువేసేవాళ్ళు వేస్తున్నారు. "అమ్మా, మా అమ్మే! నీకెంత ఆపద వొచ్చిందే!" అని ఏడ్చేవాళ్ళు ఏడుస్తున్నారు. అంతా గంద్రగోళంగావుంది.

ఆమెకు స్పృహతప్పిందేగాని మెదడు ఆట్టం మానెయ్యలేదు—ఆడుతూనే వుంది. హొట్టప్పుడుకంటే యింకా తీవ్రంగా, వేగంగా ఆడుతూ వుంది. అనేక బొమ్మలు కనిపిస్తున్నయ్, అనేక దృశ్యాలు వొస్తున్నయ్. కండలు తిరిగిన మొగాళ్ళు మీద మీదకు వొస్తున్నారు. భోగంవాళ్ళు నృత్యం చేస్తున్నారు ఒకతె తాళం టకటక కొడుతూ పాడుతూవుంది.

నిన్న రాత్రి

కలలో వొచ్చి

చెంతజేరి

ముద్దులాడి....

పైకి స్పృహతప్పి శవానికిమల్లే పడివుందిగాని ఆమె తలమాత్రం కోలాహలంతో, గంద్రగోళంతో, వొచ్చే పోయే బొమ్మలతో దృశ్యాలతో బద్దలయిపోతూవుంది.

ఒక్కక్షణం ఆల్ క్లియర్.

తనులంగాకట్టుకొని ఆడుకొంటూంది. గుత్తంగా జాకెట్టు తొడుక్కొని వుంది....నిరుడు కుట్టించింది. నిరుడు అమ్మవొదులుగానే కుట్టించింది. బొమ్మల పెళ్ళిళ్ళు జరుగుతున్నై. రాధా కృష్ణులు ఉయ్యాల్లో పవళింపు సేవ చేస్తున్నారు. తాను వెళ్ళి రాధ బొమ్మ ముందుకు నెట్టి యిద్దర్నీ కలిపింది.

"బొమ్మల పెళ్ళిళ్ళు చేసుకుందాం?" అని అడిగాడు వొక పిల్ల వాడు.

"ఛీ, ఎక్కడైనా మొగాళ్ళతో బొమ్మల పెళ్ళిళ్ళు చేసుకుంటారా ఏమిటి?"

"ఏం చేసుకుంటే? ఏమో!"

"అయితే పుల్లాట ఆడదాం?"

"ఎల్లా వుంటుంది?"

"బాగుంటుంది"

"వొద్దమ్మా, అమ్మ కొడతది."

"క్కాసేపే!....అమ్మతో చెప్పొద్దు...."

ఇంతలో తుఫాను చెలరేగింది. పాతబొమ్మలు కొట్టుకుపోయినయ్. ఆ తుపాన్లో పెన్సిళ్ళు, బలపాలూ కొట్టుకొచ్చినై. ఎక్కడ చూసినా పెన్సిళ్ళే! ఎక్కడ చూసినా బలపాలే! ఆ పెన్సిళ్ళన్నిటికీ ముక్కులు విరిగి వున్నయ్! వాటికి ఎదురుగా నిమ్మకాయలు కొట్టుకొచ్చినై! అవి పొంగుతున్నై....బుస బుస పొంగుతున్నై.

"ఏయ్ పిల్లా?"

"ఏమయ్యా"

"నిమ్మకాయ యిస్తా?"

"............"

"ఏదీ...."

"ఊరుకో....అయ్యో!"

"నా మాట ఏం చెపుతావ్?"

"............"

"పిల్లా....ఏం పిల్లరా?"

తన ఇష్టం లేకుండానే తీసుకున్నాడు. రెండుచేతులతో రెండూ తీసుకున్నాడు. ఏం చేస్తున్నాడూ? ఇంత హాయిగా వుందే! "అమ్మా....పుష్...."

ఒక పెద్ద దేవాలయం. ఆమె పువ్వులు పళ్ళెంలో పెట్టుకొని వెళ్తూ వుంది. రోడ్డుకి రెండువక్కలా చెట్లు దట్టంగా పెరిగినై. ఆ చెట్లనవున్న కాయలు చూస్తే ఆమెకు వొణుకు పుట్టింది. వొళ్ళంతా జెర్రిపోతు పాకినట్లు జరజరా మంది.

"చెట్లు బాగున్నయ్"

"........"

"ఆ కాయలు...."

"........"

"వాటి పేరేమిటి?"

"........"

"ఛీ! అదేం పేరమ్మా!" ఎంత సిగ్గుపడింది. కాని ఆ పేరు గుళ్లోకి, గుడి బయటికి ఆమె వెంటపడింది. పూజారి శఠగోపురం పెడుతూ వుంటే ఆ పేరు జ్ఞాపకంవొచ్చి నవ్వుకుంది. పూజారి శఠగోపురం తలకు అనించాడు. అనించాలనే అనించాడు. ఆ పేరు తనలోతాను పదే పదే అనుకుంది. కాని మనస్సులో అనుకోవటం తృప్తినివ్వలా. బయటకు అనాలి ఆ ధ్వని వినాలి. గుడిచాటున తొంగుని నెమ్మదిగా ఆ పేరు చెప్పు కుంది. ఆ ధ్వని వొళ్ళంతా పాకి చక్కిలిగింతలు పెట్టుకుంది. ఆరోజు మొదలుకొని తీరిగ్గా పడుకొని కళ్ళుమూసుకొని దేవాలయంమీద బొమ్మలు ఊహించుకుంటూ ఆ కాయలపేరు అనుకుంటూ ఉండేది. ఏమిటో యెందుకో బాగుండేది.

ఒక పుట్ట పుట్టింది. పెరిగింది – బ్రహ్మాండమంత పెరిగింది బద్ద లైంది. పుట్టలోనుంచి పాములు బిలబిలా లటలటా బయల్దేరినై. ఎన్ని పాములు! అన్నీ పాములే! ఆ పాములు జర్రు జర్రున కలుగులలోకి పోతుంటే?– అమ్మో, పాములే!"

"............"

"అబ్బా!"

"............"

"ఉష్...."

"........"

"పాము....బూచి....ఛీఛీ"

కొబ్బరికాయలు, కొబ్బరిచెట్లు, అరటిచెట్లు....గెలదిగి అరటిచెట్టు. భారంగా వొంగితే ఆమెకు ప్రేమ కలిగింది– ఆ చెట్టుమీదా, తర్వాత దులమీదా! తలకింద పెట్టుకొని పడుకున్న పీటని తీసుకొని కావిలించుకుంది. పై భాగం చేత్తో నిమురుతూ "రారా నా తనయా, బిరబిరా రారా నా తనయా" అని పాడింది.

"అదేమిటి అబ్బాయి రవికలోకి చెయ్యి పోనిస్తాడు. ఆడుకుంటున్నాడా?"

"ఉఁ....ఉఁ...."

"ఉఁ....ఉఁ...."

"పిచ్చిముండ"

వారాల అబ్బాయికి తలంటి పోస్తావుంది. హిందీ. పాడు హిందీ. ఎవ్వరున్నారు? పాపం ఎన్నాళ్ళయిందో తలంటిపోసుకుని! వెనుక నుంచుని ఛాతీ అంచును తోమింది. స్తనాలు అతని వీపుకు తగిలినై. అతడు వెనక్కి తిరిగి చూశాడు. అదేమిటి అట్టా చూస్తాడు? ఇదేమిటి వాళ్ళంతా నఖశిఖ పర్యంతం!

రాత్రి పడుకుంది—అబ్బే, నేను చెయ్యాలని చెయ్య లేదు. నేను అట్లా చేస్తానా?"

"........"

"అబ్బే, తమ్ముడు కాదూ"

"——"

"అదేమిటి తమ్ముడూ, జుట్టు అట్లావుంది? నూనె రాసి దువ్వనా?"

"——"

"చెంపలకి మన్నయింది తమ్ముడూ, తుడుస్తా"

"——"

"తమ్ముడూ....తమ్ముడూ....మాబాబే!........అట్లా అట్లా...."

ఒక్కగాలి కొట్టింది. చెట్లన్నీ పడిపోయినై. పెద్ద వరద వొచ్చింది. వరద వరద– ఏం వరద! వరద అంచున మేడ నురుగల్లే ఆమేడ ఎప్పుడూ– వరద యెంత పొంగినా సరే! –వరద అంచునే వుంటుంది. ఆ మేడలో వొకమ్మాయి మత్తుగా భారంగా కూర్చొనివుంది. ఆ అమ్మాయికి రాత్రే కార్యం అయింది. ఆ పిల్లని చూస్తే తనకి ఎంత జాలికలిగింది!

"నొప్పులమ్మా!" అడిగింది.

"——"

"వొళ్ళంతా నొప్పులా?"

"........"

"ఇక్కడా?....ఇక్కడా....ఇక్కడా...." వొళ్ళంతా నిమిరింది. ఆ పిల్ల వొళ్ళు పిసుకుతూంటే ఆ పిల్లకు భర్తమీద ఎంత ప్రేమ కలిగింది– –"మొగాళ్ళమ్మా– వొట్టి మొండి...."

ఎవ్వరిది? పెట్రోమాక్సులైటులో గాలి కొడుతున్నారు. లైటుకి గాలి కొడుతుంటే తనగుండె దడదడా కొట్టుకుంటుందే! పొత్తికడుపులో ఏదో ఏదో తిరిగినట్టు ఉంటుందే!

అకస్మాత్తుగా అన్నీ జంతువులుగా మారినై. రకరకాల జంతువులు– పక్షులు– కోళ్ళున్నయ్. వొకపుంజు పెట్టని 'కెకెకెకె' అంటూ తరుముతూ వుంది. పెట్ట రెక్కలు విప్పుకుని పరుగెత్తింది. ఎంతదూరం పరుగెత్తుతుంది బిడ్డ! పుంజు ముక్కుతో పెట్టముందు జుట్టుపట్టుకొని పైకెక్కింది. పెట్టతోక పైకెత్తింది పుంజు తోకముడిచింది.

"ఓసి నీ దుంపతెగా! ఎంత విసిగించావే!"

"........"

"ఎందుకట్లా విసిగించటం?"

"విసిగిస్తే బాగుంటుందా?"

"........"

"బాగావుందే!"

"మరి తాను...."

అదేమిటి పాలేరు కొబ్బరికాయలు అట్లాపగలగొడతాడేమిటి?.... అబ్బా— కొంచెం నెమ్మదిగా కొట్టగూడదా? వాడి కండలు చూడు. ఎట్లా పైకి తిరిగివున్నయ్! వాడు చేతులు పైకి ఎత్తితే ఎదు(రొమ్ము అంచులు ఎట్లా ఉబ్బుతున్నయ్!

వాడు పడుకున్నాడు. గు(రుపెట్టి ని(దపోతున్నాడు. ఆమెకు ని(ద పట్టటంలా. దొర్లితే మంచం వొత్తుకుంటూవుంది. బొక్కా-బోర్లా పడుకుంటే! అబ్బే, మరీ ఇబ్బందిగావుంది. లేచి నెమ్మదిగా వాడు పడుకొన్నచోటుకి వెళ్ళింది. నెమ్మదిగా కాలి బొటనవేలితో చంకలో తన్నింది. వాడు తుళ్ళిపడి లేచాడు.

"ఏం? అమ్మా?"

"లే"

"ఎందుకు?"

"దారికి అడ్డంగా పండుకున్నావేం?"

కాని నిజంగావాడిని అందుకేనా తాను తన్నింది. అందుకే అయితే బొటనవేలు ఉపయోగించటం ఎందుకు? చంకనే ఏరుకోవటం ఎందుకు? వాడు వస్తున్నాడు. సింహంలాగా వస్తున్నాడే! అదేమిటి వాడిచూపులు? ఏమిటి అంటారు? వాములదొడ్డా? బస్తాలవెనకా? వాడు ఎదు(రొమ్ము ఎట్లావుంది? తల ఆన్చి పడుకుంటే హాయిగా చలవరాతి తిన్నెకిమల్లే వుంటుంది. మీసాలు—దవడలు—చేతులు వేస్తున్నాడు. ఎందుకు? ఏం జేస్తాడు? చెరచటం

అంటే ఏమిటి? ఎట్లా ఉంటుందో నవ్వుతున్నాడు. చేతులు చాస్తున్నాడు. పట్టుకుంటున్నాడు. ఆమె అతని పట్టు విడటానికి తన్నుకుంది. వాడు ఆమెను చేతులలోకి ఎత్తుకొని ముద్దుపెట్టుకోబోయాడు. ఆమె రక్కింది. వాడు కోపంగా ఎత్తికుదేశాడు. పాతివ్రత్యంతో ఎండుకొని ఇలకరుచుకుపోయిన ఆమె నరాలు ఆ ఊహతో సళ్ళిచ్చినయ్. రక్తం మామూలుగా ప్రవహించటం మొదలుపెట్టింది. వాడు ఆమెను లేవకుండా అదిమిపెట్టాడు.

"పూ-వూ- అబ్బా-వొద్దు ఛీ! పాడునొప్పి-

"కాదు- ఒరే వెంకా?"

ఈమాటలు ఎవ్వరికీ వినబడలేదు. ఆమె మూలుగుతూ లేవటం మాత్రమే అందరికీ కనిపించింది. "తేరుకుందమ్మా! నీళ్ళు తాగించండమ్మా!" అన్నారు అంతా.

ఆమె లేచి పక్కనవున్న పదహారేళ్ల అమ్మాయిని కావలించుకుంది. ఆ ఒళ్ళు యింత వెచ్చగా వుందే! ఇంతగట్టిగా నున్నగా తగుల్తుందే! మూలుగుతూనే ఆ పిల్ల వొళ్లంతా సవరదీసింది. బుగ్గలు నిమిరింది. గాఢంగా కావిలించుకొంది. చేతులు- ఏంచేసేవో! మళ్ళీ ఆమెకు స్పృహ తప్పింది. ఈసారి లేవలేదు. ఎత్తినచెయ్యి పడిపోయింది. ఆ చేతికింద మన ఆధ్యాత్మిక నాగరికత యిచ్చిన బుళాకీలు, ముక్కుపుడకలు, మట్టెలు, మంగళ సూత్రాలు పిప్పి పిప్పి అయినై. అంతే ఆమె యిక లేవలేదు.

"పతివ్రతమ్మా" "దొడ్డ యిల్లాలమ్మా" అన్నారు అంతా. నెల రోజులు తిరిగివచ్చేటప్పటికి పతివ్రతపేర ఆ వూళ్ళో వొక దేవాలయం వెలిసింది.